తగ్గిన ప్రసూతి మరణాలు

- 2023-24లో 260 నమోదు
- అంతకుముందు ఏడాది కన్నా తక్కువ
- వైద్యారోగ్యశాఖ తాజా నివేదిక

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత ఏడాది ప్రసూతి మరణాలు తగ్గినట్టు వైద్యారోగ్యశాఖ తెలిపింది. 2022-23లో 340 మరణాలు నమోదు కాగా, 2023-24లో 260కి తగ్గినట్టు తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం దేశంలోనే అతి తక్కువ ప్రసూతి మరణాలు నమోదవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉన్నది. ప్రసూతి మరణాలపై నివేదికను విశ్లేషించగా ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి.

- రాష్ట్రంలో అత్యధిక ప్రసూతి మరణాలు ఉన్న జిల్లాల్లో సంగారెడ్డి మొదటి స్థానంలో ఉన్నది. ఆ జిల్లాలో 27 మరణాలు నమోదయ్యాయి. తర్వాతి స్థానాల్లో హైదరాబాద్, నిజామాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ ఉన్నాయి.
- 2022-23తో పోల్చితే గత ఏడాది మొత్తంగా మరణాలు తగ్గినా నిజామాబాద్, నారాయణపేట, మంచిర్యాల, సంగారెడ్డి, జోగులాంబ గద్వాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో పెరగటం ఆందోళన కలిగిస్తున్నది. మిగతా 27 జిల్లాల్లో తగ్గుదల నమోదైనట్టు నివేదిక తెలిపింది.
- అత్యధిక శాతం ప్రసవించిన వారంలోపే జరుగుతున్నట్టు గుర్తించారు. మొత్తం మరణాల్లో 50 శాతం వారంలోపే జరిగినట్టు తేలింది. ప్రసవ సమయంలో 10 శాతం మాత్రమే మరణాలు నమోదవుతున్నాయి.
- చనిపోయినవారిలో 71 శాతం మందికి సిజేరియన్ కాగా, 29 శాతం మంది నార్మల్ డెలివరీ అయినట్టు వెల్లడైంది.
- మరణించినవారిలో 21-25 ఏండ్ల వయస్కులే 40 శాతం మంది ఉన్నారు. 26-30 ఏండ్ల మధ్యవయస్కులు ఉండగా, తర్వాత స్థానంలో 18 నుంచి 20 ఏండ్లలోపు వారు ఉన్నారు.
- మరణాలకు దారితీస్తున్న కారణాల్లో గుండె సంబంధ సమస్యలు, రక్తపోటు, ఊబకాయం, రక్తస్రావం, అబార్షన్ వంటివి ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

'ధరణి'ని బలోపేతం చేస్తాం

- పోర్టల్‌ను మరింత సులభతరం చేస్తాం
- ధరణి కమిటీ సూచనల మేరకు చర్యలు
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌ను బలోపేతం చేయడంతోపాటు అందరికీ సులువుగా అర్థమయ్యేలా మార్పులు చేర్పులు చేపట్టబోతున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ధరణి కమిటీ సభ్యులు సచివాలయంలో మంత్రి పొంగులేటితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధరణి కమిటీ సిఫారసులపై సుధీర్ఘంగా చర్చించామని, తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించే ముందు అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రంలో భూ సంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతోపాటు 18 రాష్ట్రాల్లోని ఆర్వోఆర్ యాక్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. భూ వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునల్‌లను ఏర్పాటు చేసి, ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ సూచించిందన్నారు. గత ప్రభుత్వం పార్ట్-బీలో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించడానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో ధర ణి కమిటీ సభ్యులు కోదండ రెడ్డి, సునీల్ కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

వారంలో పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించండి: సీసీఎల్ఏ

ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారంలో పరిష్కరించాలని సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధరణి దరఖాస్తులపై సమీక్షించారు. జిల్లాల వారీగా పెండింగ్ దరఖాస్తులు, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల స్థాయిలో పరిష్కరిస్తున్న విధానంపై అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.45 లక్షలకుపైగా పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి.

ఏఈఈ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అగ్రికల్చర్ శాఖకు చెందిన 62 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (ఏఈఈ) ఫలితాలు శుక్రవారం విడుదల చేసినట్టు టీజీపీఎస్సీ సెక్రటరీ తెలిపారు. ఫలితాలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని జూలై 31 వరకు కొనసాగిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసింది.

లాసెట్‌లో మైనార్టీ గురుకులాల సత్తా

హైదరాబాద్, జూన్14 (నమస్తే తెలంగాణ): లాసెట్-2024లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ విద్యార్థులు సత్తా చాటారు. 57మంది లాసెట్ రాయగా, 40 మంది అర్హత సాధించినట్టు సొసైటీ సెక్రటరీ ఆయేషా మస్రత్‌ఖాన్ శుక్రవారం వెల్లడించారు.

'గెస్ట్ లెక్చరర్ల జీతాలు విడుదల చేయండి'

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ డిగ్రీ కాలేజీల గెస్ట్ లెక్చరర్లకు నాలుగు నెలల నుంచి జీతాలు ఆగిపోయాయని, దీంతో ఇబ్బంది పడుతున్నామని గెస్ట్ లెక్చరర్ల సంఘం వాపోయింది. శుక్రవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేసింది.

వైద్యశాఖలో ఉన్నతాధికారుల డిష్యుం డిష్యుం!

- సార్ ప్రిపేర్ కాలేదట.. మేడమ్ కసురుకున్నారట
- తారస్థాయికి ఇద్దరు అధికారుల మధ్య విభేదాలు
- మంత్రి రాజనర్సింహ దగ్గరికి చేరిన పంచాయితీ
- తరుచూ అవమానిస్తున్నారంటూ డీపీహెచ్ ఆవేదన!

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖలో ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరినట్టు తెలిసింది. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, డీపీహెచ్ రవీందర్ నాయక్ మధ్య కొన్ని రోజులుగా మనస్పర్థలు పెరుగుతున్నాయని చర్చ జరుగుతున్నది. క్రిస్టినా జడ్ చొంగ్తు ఘాటుగా మాట్లాడుతుంటారని మొదటి నుంచీ ఫిర్యాదులు ఉన్నాయి. రవీందర్ నాయక్ వ్యవహార శైలిపైనా సిబ్బంది తీవ్ర అసహనంతో ఉన్నట్టు సమాచారం. తాజాగా జరిగిన ఓ సంఘటనతో ఇది తీవ్రమై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దగ్గరికి పంచాయితీ చేరినట్టు సమాచారం. రాష్ట్రంలోని బ్లడ్‌బ్యాంకుల పనితీరుపై మంత్రి గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. మంత్రి దగ్గరికి వెళ్లే ముందు హెచ్‌వోడీలు హెల్త్ సెక్రటరీని కలిశారు. ఈ సందర్భంగా ఆమె బ్లడ్‌బ్యాంకుల పనితీరుపై డీపీహెచ్‌ను అడగ్గా, తన వద్ద సమాచారం లేదని, ప్రిపేర్ అయి రాలేదని చెప్పినట్టు తెలిసింది. దీంతో ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ప్రిపేర్ అయి రాకుండా రివ్యూకు ఎందుకు వచ్చారని కసురుకున్నట్టు సమాచారం. మంత్రి దగ్గరికి రావాల్సిన అవసరం లేదని ముఖం మీదే చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అందరిముందే ఇదంతా జరగటంతో రవీందర్ నాయక్ నేరుగా మంత్రి దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఏ అంశంపై సమీక్ష నిర్వహిస్తున్నారో ముందుగా చెప్పలేదని, పైగా తన పరిధిలో బ్లడ్‌బ్యాంకులు లేవని చెప్పినట్టు తెలిసింది. గతంలోనూ పలుమార్లు తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. బ్లడ్‌బ్యాంకులపై మంత్రి సమీక్షలోనూ ఆయన పాల్గొనలేదని తెలిసింది. దీనిపై మంత్రి కార్యాలయం ఆరా తీసినట్టు సమాచారం. ఏ అంశాలపై సమీక్ష చేసేది.. ముందస్తుగానే డీపీహెచ్ కార్యాలయానికి సమాచారం అందించామని చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య విబేధాలు ఇంకెంత ముదురుతాయోనని వైద్యశాఖలో చర్చ జరుగుతున్నది.

టీటీడీ నూతన ఈవోగా జే శ్యామలారావు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన ఈవోగా జే శ్యామలారావును నియమిస్తూ ఏపీ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1997 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి శ్యామలారావు ప్రస్తుతం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు టీటీడీ ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డి సెలవుల్లో ఉన్నారు. ఆయనను రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

హైదరాబాద్, కర్నూలులో ఈడీ సోదాలు

- రూ.101 కోట్లకు రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ మోసం

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : బ్యాంకులను మోసం చేసిన కేసులో రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, టెలిట్రానిక్స్ సంస్థల్లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లో ఈడీ సోదాలు చేపట్టింది. బెంగళూరులో రామకృష్ణ ఎలక్ట్రానిక్స్‌పై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రామకృష్ణ టెలిట్రానిక్స్ డైరెక్టర్లు, భాగస్వాములు రాఘవేంద్ర, రవికుమార్ ఇండ్లలో సోదాలు చేపట్టారు. వీరు గతంతో యూనియన్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.101.48 కోట్ల రుణాన్ని దుర్వినియోగం చేసినట్లు బ్యాంకు అధికారులు గుర్తించి సీబీఐకి ఫిర్యాదు చేశారు. రామకృష్ణ గ్రూప్ ట్రేడింగ్ కంపెనీ సెల్‌ఫోన్ల మార్కెటింగ్ ముఖ్యంగా సోనీ/శాంసంగ్ ఉత్పత్తుల వ్యాపారంలో పేరుగాంచింది. ఈ సోదాల సందర్భంగా డైరెక్టర్లు, భాగస్వామ్యులకు చెందిన బ్యాంక్ ఖాతాల్లో రూ.1.45 కోట్ల నగదు ఫ్రీజ్ చేశారు. విదేశీ చెల్లింపులకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

బస్‌భవన్‌ను సందర్శించిన ట్రెయినీ ఐఏఎస్‌లు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో అమలు చేస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేయడానికి ట్రెయినీ ఐఏఎస్‌లు శుక్రవారం బస్‌భవన్‌ను సందర్శించారు. సంస్థ ఎండీ సజ్జనార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి తమ కార్యక్రమాలను వివరించారు. ఆర్టీసీ పనితీరు,ఉద్యోగులసంక్షేమం, మహాలక్ష్మిపథకం అమలు, ప్రయాణికులకు కల్పిస్తోన్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2023 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌లు ప్రస్తుతం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్-హెచ్ఆర్డీ)లో ప్రాక్టికల్ శిక్షణ తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్‌తోపాటు ఎంసీఆర్‌హెచ్ఆర్డీ సీడీఎస్ సెంటర్ హెడ్ డాక్టర్ కందుకూరి ఉషారాణి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంజీ భూముల కేసులో ప్రతివాదిగా చేర్చండి

హైకోర్టుకు మాజీ మంత్రి రాములు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): క్రీడల అభివృద్ధి పేరుతో ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌కు హైదరాబాద్‌లో 855 ఎకరాల భూముల కేటాయింపు, నిధుల విడుదలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ 2012లో ప్రముఖ జర్నలిస్ట్ ఏబీకే ప్రసాద్, న్యాయవాది టీ శ్రీరంగారావు, వీ విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిల్స్‌పై శుక్రవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపింది. ఈ వ్యాజ్యాల్లో తనను ప్రతివాదిగా చేర్చాలని మాజీ మంత్రి పీ రాములు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ దర్యాప్తు అవసరం లేదని తెలపగా, ధర్మాసనం తదుపరి విచారణను జూలై 2కు వాయిదా వేసింది.

రమ్మీని అనుమతించకపోవడంపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేస్ కాలనీలో ఏర్పాటు చేసుకున్న రిక్రియేషన్ సెంటర్‌లో 13 కార్డుల రమ్మీ/సిండికేట్ గేమ్స్‌కు అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం, పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. తమ రిక్రియేషన్ సెంటర్‌లో రమ్మీని అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ ఎమ్మెల్యేస్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి రామచంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టి.. సీఎస్, హోం, న్యాయ శాఖల ముఖ్య కార్యదర్శులు, డీజీపీ, నగర పోలీసు కమిషనర్లకు నోటీసులు జారీచేసింది.

కేటీఆర్‌పై ఎలక్షన్ పిటిషన్లు

ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్లు దాఖలయ్యాయి. కుమారుడు హిమాన్షు పేరిట ఆస్తులు ఎలా వచ్చాయన్న విషయాన్ని కేటీఆర్ తన ఎన్నికల అఫిడవిట్‌లో వివరించలేదంటూ సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి, లగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. కౌంటర్ల దాఖలు నిమిత్తం కేటీఆర్, సీఈసీ, తెలంగాణ సీఈవో, సిరిసిల్ల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన ఆర్డీవోకు నోటీసులు జారీచేసి.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేశారు.

విదేశీ శునకాల పెంపకాన్ని నిషేధించడంపై హైకోర్టు స్టే

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): అమెరికన్ బుల్‌డాగ్స్ లాంటి క్రూరమైన 25 రకాల విదేశీ శునకాల దిగుమతి, పెంపకాన్ని నిషేధిస్తూ మార్చి 12న కేంద్రం జారీచేసిన సర్క్యులర్‌పై హైకోర్టు స్టే విధించింది. సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. కౌంటర్ దాఖలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసి.. విచారణను జూలై5కి వాయిదా వేశారు.

బాహుబలి ఐపీవోకి హ్యుందాయ్!

సెబీకి దరఖాస్తు చేసుకునే యోచనలో సంస్థ

ముంబై, జూన్ 14: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్ మోటర్ ఇండియా. .స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమైనట్లు తెలుస్తున్నది. మెగా బాహుబలి ఐపీవోకి రావడానికి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకునే యోచనలో సంస్థ ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఐపీవో ద్వారా కనీసంగా 3 బిలియన్ డాలర్లు(రూ.25 వేల కోట్లు) నిధులను సేకరించాలని సంకల్పించింది. ఈ ఐపీవోకి సెబీ అనుమతిస్తే..దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీవో కానున్నది. ఇప్పటి వరకు ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీ సేకరించిన 2.7 బిలియన్ డాలర్లు అత్యధికం. అలాగే దేశీయ పారిశ్రామిక రంగంలో ఇదొక మైలురాయిలా నిలువనున్నదని, ముఖ్యంగా రెండు దశాబ్దాల తర్వాత ఐపీవోకి రాబోతున్న ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ కావడం విశేషం. ఈ ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 14 కోట్ల నుంచి 15 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించాలని హ్యుందాయ్ యోచిస్తున్నది.

అయోనిక్5 కార్ల రీకాల్

ఇంటిగ్రేటెడ్ చార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లో సాంకేతిక సమస్యలు రావడంతో 1,744 యూనిట్ల అయోనిక్5 వాహనాలను రీకాల్ చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. జూలై 21, 2022 నుంచి ఏప్రిల్ 30, 2024లో తయారైన ఈ మాడళ్లలో 12వీ బ్యాటరీ డిచార్జి అవుతుండటమే ఇందుకు కారణమని వెల్లడించింది.

కలవరపెడుతున్న వాణిజ్యలోటు

గత నెలలో 23.78 బిలియన్ డాలర్లుగా నమోదు

న్యూఢిల్లీ, జూన్ 14: గత కొన్ని నెలలుగా రెండంకెల స్థాయిలో వృద్ధిని కనబరిచిన దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. గత నెలకుగాను దేశీయ ఎగుమతులు 9.1 శాతం వృద్ధితో 38.13 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇదే నెలలో దిగుమతులు 7.7 శాతం అధికమై 61.91 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) ఏడు నెలల గరిష్ఠ స్థాయి 23.78 బిలియన్ డాలర్ల వద్ద ముగిసింది. అక్టోబర్ 2023లో నమోదైన 31.46 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చడం వల్లనే ఎగుమతుల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించాయి.

ఆభరణాల ఎగుమతులు డౌన్

ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. మే నెలలో జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతులు 4.95 శాతం తగ్గి రూ.20,713.37 కోట్లకు పరిమితమైనట్లు జెమ్ అండ్ జ్యూవెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో రూ.21,795.65 కోట్లు(2,646.92 మిలియన్ డాలర్లు) విలువైన ఆభరణాలు ఎగుమతయ్యాయి. కానీ, బంగారు ఆభరణాల ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 13 శాతం ఎగబాకి రూ. 5,507.71 కోట్లకు చేరుకోగా, వెండి ఆభరణాల ఎగుమతులు కూడా రెండింతలు పెరిగి రూ.665 కోట్ల నుంచి రూ.1,103.72 కోట్లకు చేరాయని వెల్లడించింది.

- చమురు దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 28 శాతం పెరిగి 20 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏప్రిల్-మే మధ్యకాలంలో ఇవి 36.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- పసిడి దిగుమతులు 3.69 బిలియన్ డాలర్ల నుంచి 3.33 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.
- అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో ఎగుమతులు 5.1 శాతం పెరిగి 73.12 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 8.89 శాతం అధికమై 116 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్యలోటు 42.88 బిలియన్ డాలర్లు.
- సేవల ఎగుమతులు 26.99 బిలియన్ డాలర్ల నుంచి 30.16 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- ప్రధానంగా భారత్ నుంచి అమెరికా, నెదర్లాండ్స్, యూఏఈ, మలేషియా, బ్రిటన్ దేశాలకు వస్తువులు ఎగుమతి అవుతున్నాయి.

> ఎగుమతులు గత నెలలో ఆశాజనక పనితీరు కనబరిచాయి. మిగతా నెలల్లో కూడా ఇదే ట్రెండ్‌ను కొనసాగించే అవకాశాలున్నాయి. వాణిజ్యలోటు కలవరపెడుతున్నప్పటికీ ప్రపంచ దేశాల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నది భారతే కావడంతో భవిష్యత్తులో దేశీయంగా డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయి. లోటు పెరిగిందని కలవరపడాల్సిన అవసరం లేదు.
>
> - సునీల్ బర్త్వాల్, వాణిజ్య శాఖ కార్యదర్శి

వాణిజ్య

HYSEA

ఐటీ అభివృద్ధికి హైసియా కార్యాచరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీల అభివృద్ధే లక్ష్యంగా హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్(హైసియా) ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ఇటీవల కొత్తగా ఏర్పాటైన హైసియా మేనేజ్‌మెంట్ కమిటీ నాలుగు ప్రధాన అంశాలతో రెండేండ్ల కాలానికి సంబంధించిన ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను ప్రకటించింది. మెంటర్ ఎంగేజ్‌మెంట్, ఫ్యూచర్ రెడినెస్, థాట్ లీడర్‌షిప్, గవర్నమెంట్ రిలేషన్స్ అండ్ పాలసీ అంశాలతో వ్యూహాత్మక విజన్ 2024-26ను రూపొందించింది. మెంబర్ ఎంగేజ్‌మెంట్‌లో భాగంగా ఐటీ కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా విద్య, పర్యావరణం, ఆరోగ్య విభాగాల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా స్టార్టప్‌లను ప్రోత్సహించడం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచేలా చర్యలు తీసుకోవడం, ఐటీ పరిశ్రమకు అవసరమైన అంశాలపై ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చించడం వంటి అంశాలు ప్రధాన అజెండాగా హైసియా ఈ కార్యాచరణను రూపొందించింది.

టీ హబ్‌లో మొబిలిటీ చాలెంజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీతో కలిసి టీ హబ్.. మొబిలిటీ చాలెంజ్‌ను నిర్వహిస్తున్నది. ఆటోమొబైల్ రంగంలో ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించడంతో పాటు ఎంపిక చేసిన స్టార్టప్‌లకు మార్కెట్‌పై అవగాహన కల్పించడం, వ్యాపార, వాణిజ్య ప్రణాళికలను మెరుగుపర్చి మార్కెట్‌లోకి వెళ్లేందుకు సిద్ధం చేసేలా ఇంక్యుబేటర్‌తో సహాయ సహకారాలను అందించనున్నారు. ప్రధానంగా అత్యాధునిక టెక్నాలజీలైన వీడియో ఎనలిటిక్స్, కృత్రిమ మేధస్సు, ఎంఎల్, డాటాఎనలిటిక్స్‌లో స్టార్టప్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు ఈ లింకు (https://bit.ly/3xjuO8B) దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

బాబోయ్.. ఆర్థిక మోసాలు

- సగం మంది భారతీయులు నష్టపోయినవారే
- లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి

ముంబై, జూన్ 14: గడిచిన మూడు సంవత్సరాల్లో 47 శాతం మంది భారతీయులు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆర్థిక మోసాల బారినపడ్డారని శుక్రవారం విడుదలైన ఓ సర్వే తెలియజేసింది. యూపీఐ, క్రెడిట్ కార్డ్ మోసాలే అధికంగా జరిగాయని పేర్కొన్నది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల నుంచి 23,000 మంది అభిప్రాయాలతో లోకల్‌సర్కిల్స్ ఈ సర్వేను చేపట్టింది. వీరిలో సగం మందికిపైగా తమ క్రెడిట్ కార్డులపై దేశ, విదేశీ వ్యాపారులు/వెబ్‌సైట్లు అనధికారిక చార్జీలను వేసినట్టు చెప్పారని వెల్లడించింది. ఇక సర్వేలో పాల్గొన్నవారిలో 43 శాతం మంది తాము లేదా తమ కుటుంబ సభ్యులు క్రెడిట్ కార్డ్ లావాదేవీల్లో మోసపోయామని, 36 శాతం మంది యూపీఐ లావాదేవీల్లో నష్టపోయామన్నారు.

సూచీలు ఆల్‌టైమ్ హై

ముంబై, జూన్ 14: తీవ్ర ఒడుదొడుకుల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లు సరికొత్త స్థాయిలను అధిరోహించాయి. శుక్రవారం ఉదయం నష్టాల్లో ట్రేడైనా.. ఆఖర్లో మాత్రం లాభాలనే అందుకున్నాయి. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 181.87 పాయింట్లు లేదా 0.24 శాతం పెరిగి 77వేలకు సమీపంలో మునుపెన్నడూ లేనివిధంగా 76,992.77 వద్ద ముగిసింది. అయితే ఒకానొక దశలో 77,081.30 స్థాయిని తాకింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 66.70 పాయింట్లు లేదా 0.29 శాతం అందిపుచ్చుకొని క్రితమెన్నడూ లేనట్టుగా 23,465.60 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 23,490.40 స్థాయిదాకా వెళ్లింది. కాగా, ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 299.41 పాయింట్లు, నిఫ్టీ 175.45 పాయింట్లు పుంజుకున్నాయి. మహీంద్రా అండ్ మహీ